క్లుప్తంగా

నేటి నుంచి చెన్నకేశవస్వామి ఆలయ వార్షికోత్సవం

వల్లూరు : మండలంలోని పైడికాలువలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవ, కుంభాభిషేక మహోత్సవాలను శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు స్వామి హరి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 3వ తేదీన ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం అష్టోత్తర కళశ స్థాపన, గోపూజ, యాగ మంటప ప్రవేశం కార్యక్రమాలు జరుగుతాయి.

గరుడ వాహనంపై వేంకటరమణుడు

పులివెందుల టౌన్ : పులివెందులలో వెలసిన వేంకటరమణస్వామి ఆలయంలో జరగబోయే బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం వేంకటరమణుడు సతీసమేతుడై గరుడ వాహనంపై భక్తులకు కనువిందు చేశారు. పగలు స్వామివారు మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఎదుట నిలువుటద్దం ఉంచి అందులో మోహినీ అలంకారంలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. సహస్త్రనామార్చన, నిత్య హోమం, కలశారాధన, విశేష పూజలు జరిపించారు. ఉభయదారులచే ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ప్రత్యేక పూజలు జరిపించారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట

వల్లూరు : మండలంలోని పెద్దలేబాక, బక్కిరెడ్డిపల్లె గ్రామాల సరిహద్దున నూతనంగా నిర్మించిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో సిద్ధేశ్వర, పార్వతీదేవి, గణపతి, సుబ్రమణ్య స్వామి, నందీశ్వర, నాగులు విగ్రహా, ధ్వజ ప్రతిష్టా కార్యక్రమాల్లో భాగంగా గురువారం ధ్వజ స్తంభ మరియు నందీశ్వర విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వేద పండితులు శేఖర్ శర్మ ఆధ్వర్యంలో గడియారం ప్రసాద్ శర్మ బృందం వేద మంత్రాలతో ధ్వజస్తంభ ప్రతిష్టను నిర్వహించారు. అనంతరం పరమేశ్వరునికి ఇష్ట వాహనమైన నందీశ్వరుని విగ్రహ ప్రతిష్ట చేశారు.

భక్తులు రథయాత్రలో భాగస్వాములు కావాలి

చక్రాయపేట : మహాశివరాత్రి పర్వదినం పురష్కరించుకుని గ్రామాల్లో తిరుగుతున్న రథయాత్రలో భక్తులు భాగస్వాములు కావాలని శ్రీవేంకటేశ్వర రాచరాయస్వామి ఆలయాల చైర్మన్ ఓబుళరెడ్డి తెలిపారు. గురువారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడు, శివపార్వతుల ఉత్సవ మూర్తులు కలిగిన రథయాత్ర గురువారం మండలంలోని జోగిరెడ్డిపల్లె, గడ్డంవారిపల్లె, తక్కల్ల పల్లె, వైఎస్ జగన్ నగర్, నక్కలదిన్నెపల్లె, కుప్పంల మీదుగా సాగింది. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్‌లు చక్రపాణిరెడ్డి, రామాంజనేయరెడ్డి, వైస్ చైర్మన్ ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు అక్కదేవతల పూజ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కలమల్ల గ్రామ సమీపంలోని ఆర్టీపీపీ 600 మెగావాట్లు పక్కన ఉన్న గంగమ్మతల్లి అక్కదేవతల పూజ మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

సింహాద్రిపురం : మండలంలోని చవ్వారిపల్లె, దేవతాపురం గ్రామాల్లో శుక్రవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొంటారని మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఇది పేదల వ్యతిరేక బడ్జెట్

జమ్మలమడుగు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల, నిరుద్యోగ, కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని సీపీఎం జమ్మలమడుగు కార్యదర్శి వి.శివనారాయణ అన్నారు. రాష్ట్రానికి, రాయలసీమకు, కడప ఉక్కుకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ గురువారం పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నులకు అనుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలికి నివాళి

కమలాపురం : కమలాపురం మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్, వైఎస్ఆర్‌సీపీ పట్టణ కన్వీనర్ ఎస్సీ పుల్లారెడ్డి మాతృమూర్తి సుశీలమ్మ వయో భారంతో గురువారం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి వారి గృహానికి నివాళులు అర్పించారు.

పరామర్శ

చింతకొమ్మదిన్నె : మండలంలోని జమాల్‌పల్లెలో అనారోగ్యంతో ఉన్న కువైట్ బాషాను ఎమ్మెల్యే పి.రవీందన్రాథ్‌రెడ్డి పరామర్శించారు.

బడ్జెట్‌లో స్త్రీ, శిశు సంక్షేమంపై వివక్ష

ఎర్రగుంట్ల : కేంద్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధుల కేటాయింపులో వివక్షత స్పష్టంగా కనిపిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. గురువారం ఎర్రగుంట్ల సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి



ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

ముద్దనూరు : రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఆయన మండలంలోని చెన్నారెడ్డిపల్లె గ్రామంలో మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. అర్హులందరికీ పథకాలు అందించాలని, ఎవరికైనా పథకాలు అందకుంటే వాటిని పరిశీలించి వారికి లబ్ధి చేకూర్చాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో సిమెంటు రోడ్ల నిర్మాణం, వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు సుమంత్, పార్టీ నాయకులు వరదారెడ్డి, గుర్రప్ప, నవజ్యోత్ రెడ్డి, సునీల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలంలోని వేపరాల గ్రామంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొంటారని మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సుధీర్ గెలుపు.. నల్లేరు మీద నడకే..

జమ్మలమడుగు పరిశీలకులు నిత్యానందరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న పరిశీలకులు నిత్యానందరెడ్డి

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేపట్టిన పథకాల వల్ల రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ గాలి బలంగా వీస్తున్నదని తప్పనిసరిగా రాష్ట్రంలో తిరిగి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని అలాగే జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి గెలుపు నల్లేరు మీద నడకే అని జమ్మలమడుగు నియోజకవర్గ పరిశీలకులు కడప నగర డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి అన్నారు. గురువారం ఆయన జమ్మలమడుగు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హమీలే కాకుండా ఇవ్వని హమీలను కూడా అమలు చేశారన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమపథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యకర్తలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. కార్యకర్తలు ఐకమత్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పొరెడ్డి మహేశ్వరరెడ్డి, రాష్ట్ర ఇండస్ట్రీయల్ డైరక్టర్ మార్బుల్ శ్రీను, మైలవరం మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి దొడియం విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చేదోడు పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మండల ఇన్‌చార్జి, లబ్ధిదారులు

వేముల : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న చేదోడు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద జగనన్న చేదోడు పథక లబ్ధిదారులతో కలిసి మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్స్ ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరికి రూ.10వేల చొప్పున వారి ఖాతాలలో సీఎం బటన్ నొక్కి జమ చేయడం జరిగిందన్నారు. మండల వ్యాప్తంగా 200 మంది లబ్ధిదారులకు రూ.21 లక్షల మేర వారి ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. అన్ని వర్గాల వారు ఆర్థికంగా, బలోపేతం కావాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాలతో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరు జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాధాకృష్ణయ్య, కోఆప్షన్ సభ్యులు మండి మాపీరా, టైలర్స్, రజకులు, నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

బలపనూరులో సినిమా షూటింగ్

సింహాద్రిపురం : మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో గురువారం వీసీ క్రియేషన్స్ నిర్మాణ సారథ్యంలో 'పద్మవ్యూహం చక్రధారికే తెలుసు' అనే సినిమా షూటింగ్ జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట నాయకులు రవిరాజు మాట్లాడుతూ బలపనూరు వైఎస్సార్‌సీపీ నాయకులు వెలుగోటి చంద్రశేఖరరెడ్డి పూర్తి సహకారంతో చిత్ర యూనిట్ సినిమా షూటింగ్‌ను 20 రోజులపాటు పులివెందుల చుట్టూ ప్రాంతాలలో చిత్రీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామన్నారు. ఈ చిత్రీకరణలో హీరో ప్రవీణ్, హీరోయిన్ అనుశీతల్, తదితర నటీనటులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో అవకతవకలకు ఆస్కారం ఉండకూడదు

డ్వామా పీడీ యదుభూషన్‌రెడ్డి



మాట్లాడుతున్న డ్వామా పీడీ యదుభూషన్‌రెడ్డి

చెన్నూరు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీల్లో అవకతవకలకు ఆస్కారం ఉండకూడదని డ్వామా పీడీ యదుభూషన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన ప్రజా వేదిక నిర్వహించి మాట్లాడారు. 10 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఏయే పనులకు గాను ఎంత ఖర్చు చేశారో తెలియజేశారు. ప్రతి పనికి సంబంధించిన వివరాలను చదివి వినిపించారు. 01.04.2021 నుంచి 31.03.2022 వరకు 16వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా రూ.5 కోట్ల వరకు గుర్తించిన పనులపై ఖర్చు చేసినట్లు ప్రజలకు ప్రజాప్రతినిధుల సమక్షంలో తెలియజేశారు. ఈ సందర్భంగా పీడీ రామనపల్లె, ఓబులంపల్లె టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల విషయంలో అసహనం వ్యక్తం చేశారు. మస్టర్ల విషయంలో సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, ఎంపీడీఓ సురేష్‌బాబు, డీవీఓ సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్రస్థాయి క్రీడ పోటీల్లో కడప జిల్లాకు చెందిన మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. గత నెల 29, 30, 31వ తేదీల్లో రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల విద్యార్థులకు విశాఖపట్టణం జిల్లాలోని సింహాచలంలో క్రీడ పోటీలను నిర్వహించారు. వ్యక్తిగత మహిళా విభాగంలో చెస్ ఒకటవ స్థానం నందలూరు, గ్రూప్‌స్థాయిలో కబడ్డీ, వాలీబాల్ నందు వైఎస్ఆర్ కడప జిల్లా విద్యార్థులు 2వ స్థానం సాధించారు. బాలుర విభాగంలో కడప విద్యార్థులు హ్యాండ్‌బాల్ నందు రాష్ట్రస్థాయిలో 2వ స్థానం సాధించారు. వ్యక్తిగత బాలుర విభాగంలో జమ్మలమడుగు విద్యార్థులు డిస్కస్ త్రోలో 1వ స్థానం ఎం సుబ్బరాయుడు, జావెలిన్ త్రోలో రాష్ట్ర స్థాయి 3వ స్థానం బి.వంశీకృష్ణ, చెస్‌లో రెండవ స్థానంలో కమలాపురం విద్యార్థి నిలిచారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను కన్వీనర్ అండ్ ప్రిన్సిపాల్ కేవీఎస్ రామకృష్ణారెడ్డి అభినందించారు.

రేపు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఎర్రగుంట్ల : స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీడీఓ సభ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఈ క్రాప్, ఈకేవైసీ త్వరగా పూర్తి చేయండి

పెద్దముడియం : మండలంలోని సచివాలయాల పరిధిలో పనిచేసే వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈఓలు ఈ క్రాప్, ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. గురువారం ఏఓ వారితో సమావేశం ఏర్పాటు చేసి ఈ క్రాప్, ఈకేవైసీ గురించి రైతులకు తెలియజేయాలని తెలిపారు. ఈకేవైసీ చేసుకుంటేనే పంట ఇన్సూరెన్స్, సున్నావడ్డీ, పంట రుణాలు మరియు పంటల దిగుబడిని మద్దతు ధరకు అమ్ముకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు.

ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేరే విధంగా వలంటీర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని ఇప్పెంట, పెద్దకాంపల్లి, తాడిగొట్ల, సీకేదిన్నె పంచాయతీలకు సంబంధించిన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ చేరేలా సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలన్నారు. కులం, మతం ప్రాంతం, వర్గం, పార్టీలను చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా ఉంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రతి అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజలకు ఉన్న సమస్యలను తీర్చేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో–కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్‌లు రాజశేఖర్‌రెడ్డి, మల్లిఖార్జున, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న జేడీఏ నాగేశ్వరరావు

కమలాపురం : వ్యవసాయ శాఖ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉండాలని జేడీఏ అయితా నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్ పని తీరును, శాంపిల్స్ సేకరణ, పరీక్ష ఫలితాలు, వాటి రికార్డులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతు నుంచి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహించాలన్నారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉండి వారికి పంటల సాగులో మెలకువలు, అలాగే పొలంబడి, మార్కెటింగ్ తదితర అంశాల్లో సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. ముఖ్యంగా భూసార పరీక్షల ఫలితాల ద్వారా రైతులకు పంట సాగులో ఖర్చు తగ్గించడంతో పాటు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉన్నందున వాటిపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కమలాపురం 4వ ఆర్‌బీకే తనిఖీ చేశారు. సామాజిక తనిఖీ, ఆర్‌బీకే రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, ల్యాబ్ ఏఈఓలు కాంతమ్మ, భారతి, వీఏఏ వెంకటేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పంట సాగుచేయని పొలాలకు ఈ–క్రాప్ బుకింగ్ చేస్తే చర్యలు తప్పవు

పంటలు సాగు చేయని రైతుల పొలాలకు ఈ–క్రాప్ బుకింగ్ చేస్తే సిబ్బందిపై చర్యలు తప్పని జేడీఏ హెచ్చరించారు. మండలంలోని చిన్నచెప్పలిలో రబీ సీజన్‌లో సాగు చేసిన మినుము, శనగ పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ–క్రాప్ బుకింగ్ చేసిన పంట పొలాలను మండల, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు తనిఖీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

సింహాద్రిపురం : మండల పరిధిలోని రావులకొలను గ్రామ పంచాయతీ పరిధిలోని అహోబిలాపురం గ్రామానికి చెందిన రైతు లోకేశ్వరరెడ్డి(44) గురువారం ఉదయం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లోకేశ్వరరెడ్డి సాగు చేసిన శనగ పంటకు నీటి తడులు అందిస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ మోటార్ విద్యుత్ తీగలు తగలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో లోకేశ్వరరెడ్డి చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై ర్యాలీ

తొండూరు : మండల పరిధిలోని అగడూరు గ్రామంలో కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాల సందర్భంగా ఆరోగ్య సిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గురువారం అగడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం అగడూరు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ సీహెచ్ఓ సుధ మాట్లాడుతూ ప్రజలకు కుష్టు వ్యాధి లక్షణాల గురించి తెలియజేసి వ్యాధి నిర్మూలనలో ప్రజలు భాగస్వామ్యులు కావాలన్నారు. అనంతరం విద్యార్థులచే గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగాల : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా లింగాల పీహెచ్‌సీ పరిధిలో కుష్టు వ్యాధి నివారణపై పక్షోత్సవాలలో భాగంగా గురువారం లింగాల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు డీపీఎంఓ పి.వి.రమణారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి లక్షణాలు, దాన్ని ఎలా గుర్తించాలన్న విషయాలపై డీపీఎంఓ రమణారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కుసుమకుమారిలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామ్మూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ ఆశా భేగం, ఐటీఐ సిబ్బంది, పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి పర్యటన



జవహర్‌రెడ్డి చదువుకున్న పాఠశాలను పరిశీలిస్తున్న జేసీ,ఇతర అధికారులు

ముద్దనూరు : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం ముద్దనూరులో పర్యటించనున్నారు. తాను చదువుకున్న పాఠశాలలను సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలువురు ఉన్నాధికారులు ఆయన పర్యటన కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ పాఠశాలను పరిశీలించారు.శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు సీఎస్ పాఠశాలకు చేరుకుంటారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ అన్బురాజన్ పాఠశాల పరిసరాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రూరల్, అర్బన్ పరిధిలోని అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సునంద తెలిపారు. ఖాళీల వివరాలు సమీపంలోని సీడీపీఓ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని.. ఆసక్తి ఉన్నవారు ఈనెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 11వ తేది ఉదయం 11.00 గంటలకు కడప రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని వివరించారు.

పంట కోత ప్రయోగాలు

లింగాల : మండల పరిధిలోని దొండ్లవాగు, చిన్నకుడాల, వెలిదండ్ల గ్రామాల్లో గురువారం రబీ బుడ్డ శనగ పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు ముందుగా ఎంపిక చేసిన సర్వే నెంబర్ పొలాల్లో 5x5 మీటర్ల పొలాన్ని ఎంపిక చేసి పంటను కోసి పంట నూర్పిడి చేసి అందులో వచ్చిన దిగుబడిని తూకం వేసి దిగుబడి అంచనాను వేశారు. ఒక్కో పొలంలో 2.610 కిలోలు, మరో పొలంలో 5 కేజీలు దిగుబడి వచ్చినట్లు రికార్డు చేశారు. దొండ్లవాగు గ్రామంలో నిర్వహించిన పంట కోత ప్రయోగాలలో ఏఓ రమేష్, ఆర్‌బీకే ఇన్‌చార్జి, రైతులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

వేంపల్లె : జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం వేంపల్లెలోని రాజీవ్‌నగర్ సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను సీపీఐ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులకు సూక్ష్మ పోషకాలు అవసరం

వేంపల్లె : ఉద్యాన పంటలలో అధిక దిగుబడులు పొందాలంటే సూక్ష్మ పోషకాలు ఎంతో అవసరమని జిల్లా ఉద్యాన శాఖాధికారి సుభాషిణి తెలిపారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాలలో ఆమె అధికారులతో కలిసి ప్యాక్ హౌస్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చీనీ, నిమ్మ తోటలలో ఎరువులు వేసే పద్ధతులపైన రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ముఖ్యంగా ఉద్యాన పంటలలో సూక్ష్మ పోషకాలు పిచికారి చేయడం ద్వారా పూత, కాయ నాణ్యతలు పెరిగి అధిక దిగుబడిని పెంచుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ రెడ్డయ్య, ఆర్‌కేబీ సిబ్బంది మహేష్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

చెన్నూరు : స్థానిక పార్కువీధిలో మట్కా ఆడుతున్నట్లు గురువారం సాయంత్రం అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ. 5వేలు నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ప్రతి ఒక్కరూ విశ్వశాంతికి పాటుపడాలి



వేంపల్లెలో బైకు ర్యాలీలో ఓంశాంతి నిర్వాహకులు, బ్రహ్మకుమారీలు

వేంపల్లె : ప్రతి ఒక్కరూ విశ్వ శాంతి కోసం పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం నిర్వాహకులు విజయ, త్రివేణి, సౌమ్యలు తెలిపారు. గురువారం త్రిమూర్తి శివ జయంతి సందర్భంగా వేంపల్లె పట్టణ పురవీధులలో బైకుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వి.రాజారావులు హాజరై ఓం శాంతి నిర్వాహకులతో కలిసి వారు జెండా ఆవిష్కరణ చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ విశిష్టత, ఆ రోజు భక్తులు చేసే ఉపవాసం, జాగరం గురించి విపులంగా వివరించారు. కార్యక్రమంలో రాయచోటి ఓం శాంతి నిర్వాహకులు హారతి, బ్రహ్మకుమారిలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల రూరల్ : పట్టణంలోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమానికి యువతీ యువకులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని న్యాక్ సహాయ సంచాలకులు రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఆయన తెలుపుతూ న్యాక్ మరియు సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో అసిస్టెంట్ సర్వేయర్ శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యువతీ యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ శిక్షణ 90 రోజులపాటు ఉంటుందని వారికి ఉచిత వసతి, భోజనం, శిక్షణకు కావాల్సిన స్టేషనరీ, షూస్, యూనిఫాం ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల యువత విద్యార్హత సరిఫికెట్లతోపాటు ఆధార్ కార్డు, నాలుగు కలర్ పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 9985142155, 9885331972 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నాటు సారాపై అవగాహన

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలో నాటు సారా, గుట్కా, మాదక ద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్ఈబీ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని నగరిగుట్ట ప్రాంతంలో ఆయన పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. నాటుసారా వ్యాపారం మానుకుని వేరే వ్యాపారాలు చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పొదుపు సంఘాల మహిళలకు వ్యాపారాలు చేసుకునే విధంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

లాభదాయక పంటలను సాగు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి నాగేశ్వరరావు

వల్లూరు : రైతులు లాభదాయకమైన పంటలను సాగు చేసి తగిన మెళకువలను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని తప్పెట్ల, కుమారునిపల్లె గ్రామాల పరిధిలో రైతులు సాగు చేసిన వేరు శనగ, మినుము పంటలను గురువారం ఆయన పరిశీలించారు. మామిడి తోటల్లో అంతర పంటలుగా సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం రబీ పంట కాలానికి సంబంధించి ఈ క్రాప్ నమోదు జాబితా సూపర్ చెక్ నిర్వహించి పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సాయిజ్యోతి, వీహెచ్ఏ నీహారిక, రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు తక్కువ ఖర్చు.. అధిక దిగుబడి

ఎర్రగుంట్ల : చిరుధాన్యాల సాగుకు తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడి వస్తుందని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య తెలిపారు. గురువారం మండల పరిధిలోని చిన్న దండ్లూరు గ్రామం రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగులు, జొన్నలు, అరిగెలు, వంటి పంటలు సాగుకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వస్తుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రమణారెడ్డి మాట్లాడుతూ రసాయన మందులు, ఎరువుల వినియోగం తగ్గించి ఆరోగ్యమైన పంట ఉత్పత్తులను పండించాలని రైతులను కోరారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి పద్మజా మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.